మానకొండూర్, అక్టోబరు 6: మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన కాట వెంకటేశ్ (35) అనే యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన వెంకటేశ్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తండ్రి లేడనే బాధతో మద్యానికి బానిసై ఈ నెల 4న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు వెంకటేశ్ భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇల్లందకుంట, అక్టోబరు 6: మండలంలోని బూజూనూర్ గ్రామచెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందినవారు బతుకమ్మ చెరువు సమీపం గుండా ఆదివారం వెళ్తుండగా చెరువులో మృతదేహం కనబడింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 35-45సంవత్సరాల వయస్సు ఉంటుంది. కుడి చేతికి స్టీల్ కడెం, చామన్‌చాయ రంగుతో పాటు బ్లూ కలర్ ఫుల్ టీషర్ట్ ఉంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినట్లయితే 8712670778 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి



నరేష్ (ఫైల్)

మానకొండూర్, అక్టోబరు 6: మండలంలోని కెల్లేడు గ్రామ శివారులో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన అసిస్టెంట్ లైన్‌మెన్ జోగు నరేష్ విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందాడు. కొండపల్కల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కెల్లేడు గ్రామ శివారులో 33బై11 కేవి విద్యుత్ లైన్ పనులను మరమ్మతు పనులు చేసేందుకు ఆదివారం విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ సరఫరా కొనసాగుతుండడంతో విద్యుదాఘాతంతో స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

- ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మయ్య (ఫైల్)

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 6: మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భార్యతో కలిసి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య(58) తన భార్యతో కలిసి ఆదివారం దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అందుగులపల్లి గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. లక్ష్మయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందగా, అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు లక్ష్మయ్య భార్య వేముల మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

» ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
» కథ-2023 సంకలనం ఆవిష్కరణ
» కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
» అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో సుడా చైర్మన్‌కు సన్మానం


కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 6: రాష్ట్ర రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి ఘనంగా ఆత్మీయ సన్మానం జరిగింది. హైదరాబాద్ శిల్ప కళావేదికలో ఆదివారం జరిగిన రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మాన మహోత్సవంలో రాష్ట్ర రెడ్డి జేఏసీ నాయకులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ, అగ్రవర్ణ పేదల సంఘం (ఈడబ్ల్యూఎస్), రెడ్డి జాగృతి నాయకులు జి సీతారాంరెడ్డి, డి గోపిరెడ్డి, అలిగుబెల్లి సత్యనారాయణరెడ్డి, బీరం అమరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 6: అల్ఫోర్స్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు బి శివాజీచారి, హెచ్‌సాయిరెడ్డి, జి మనిచందులను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. నెట్‌బాల్ ఎస్‌జిఎఫ్ అండర్-19 విభాగంలో కళాశాలల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపిక కావడం హర్షించదగిన విషయమన్నారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి జాతీయ స్థాయిలో రాణించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిప్పర్ తాకడంతో విరిగిన ట్రాన్స్‌ఫార్మర్

- రెండు రోజులుగా కరెంట్ లేక పొలాలకు సాగునీటి కష్టాలు


విరిగిన స్తంభం

గంగాధర, అక్టోంబరు 6: మండలంలోని కురిక్యాల శివారులో టిప్పర్ తాకడంతో ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపడింది. కెనాల్ నుంచి టిప్పర్లలో కరీంనగర్ మెడికల్ కళాశాలకు మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో టిప్పర్ రోడ్డుపై గుంతలను పూడ్చేందుకు మట్టి పోస్తుండగా దాని డబ్బా విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో వైర్లు బిగుసుకుని ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి విరిగింది. మరో రెండు స్తంభాలు విరిగి పడగా విద్యుత్ పరికరాలు పనికిరాకుండా పోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 15 మంది రైతులకు వంద ఎకరాలకు మోటర్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ విరిగడంతో రెండురోజులుగా విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పొట్టదశ, గొలక దశలో ఉండగా నీరు ఎక్కువగా అవసర ముంటుంది. ఈ పరిస్థితుల్లో పొలాలకు నీరులేక దిగుబడి తగ్గి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్ తగిలిన ఘటనలో విద్యుత్ సంస్థకు లక్ష నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. విద్యుత్ అధికారులు త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పొలాలను కాపాడి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ

వీణవంక, అక్టోబరు 6: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ శరీర దారుఢ్యాన్ని పెంచుకోవాలని ఎస్‌ఐ తిరుపతి అన్నారు. బేతిగల్‌లో గొట్టే పుల్లయ్య ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డబ్బుల కోసం గొడవ.. ప్రాణం మీదకు తెచ్చింది

శంకరపట్నం, అక్టోబరు 6: మండలంలో మొలంగూర్‌లో ఇరువురి మధ్య డబ్బుల కోసం జరిగిన ఓ గొడవ ప్రాణాపాయ స్థితిలోకి తీసుకెళ్లింది. స్థానికుల సమాచారం మేరకు ఈ నెల నాలుగో తేదీ శుక్రవారం సాయంత్రం కొలిపాక సమ్మయ్య, కల్లూరి శ్రీనివాస్ మధ్య డబ్బుల లావాదేవీల విషయంలో మాటా మాట పెరిగింది. శ్రీనివాస్ బండిమీద ఉన్న సమ్మయ్యను నెట్టివేయగా కిందపడ్డ సమ్మయ్య తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం సమ్మయ్యను హన్మకొండలోని ఓ ఆసుపత్రికి తరలించారు. సమ్మయ్య కోమాలోకి వెళ్లగా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమ్మయ్య కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ ఆదివారం ఫిర్యాదు చేశారు.

ఘనంగా బంగారు బతుకమ్మ సంబరాలు


మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే గంగుల సతీమణి రజిత

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 6: వైశ్య సేవా కేంద్రం, జిల్లా ఆర్య వైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వైశ్య భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. వివిధ డివిజన్లు, గ్రామాల నుంచి మహిళలు, యువతులు వివిధ పూలు, రంగులతో పేర్చిన వైవిధ్య భరిత బతుకమ్మలను తీసుక వచ్చి బతుకమ్మ ఆటా పాటలతో, దాండియా, కోలాటాలతో సందడి చేశారు. అతిథులుగా ఎంఎల్‌ఏ సతీమణి గంగుల రజిత, కార్పొరేటర్లు పిట్టల వినోద, వంగల శ్రీదేవి, కొలిపాక అంజయ్య జ్యోతి ప్రకాశనం చేసి వేడుకలను ప్రారంభించారు. వాసవి, దుర్గా, బతుకమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహిం చారు. సహజ పూలు, రంగులతో అలంకరించిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. హాజరైన ప్రతీ మహిళకు పార్టిసిపేషన్ గిఫ్ట్, ప్రతీ పావు గంటకోసారి లక్కీడీప్ ద్వారా ఎంపిక చేసిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధి కారులు చిదుర సురేశ్, పెద్ది విద్యా సాగర్, ముస్త్యాల రమేశ్, కల్చరల్, డివోషనల్ కో ఆర్డినేటర్ నలుమాచు చంద్ర శేఖర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు కన్న కృష్ణ, కొమురవెల్లి వేంకటేశం, వడకంటి శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నగు నూరి రాజేందర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహాసభ మహిళా సంఘం అధ్యక్షురాలు చకిలం స్వప్న, పట్టణ ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి, జిల్లా ఆర్యవైశ్య యువజనసంఘం అధ్యక్షుడు తణుకు సాయికృష్ణ, స్పాన్సర్లు పాల్గొన్నారు.

వైష్ణవి అలంకరణలో దుర్గాదేవి

కరీంనగర్ రూరల్, అక్టోబరు 6: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గాభవానీ ఆలంయలో దర్గాశబానీ నవరాత్రో త్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగవ రోజైన ఆదివారం దుర్గాభవానీ అమ్మవారు వైష్ణవి అలంకరణలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయల ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక హరతులిచ్చి పూజలు నిర్వహించారు. అమ్మ వారి దీక్ష పరులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 6: సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో శరన్నవరాత్ర్యుత్సవాల్లో భాగంగా ఆదివారం శాత వాహన యూనివర్సిటీ సమీపంలోని బుడగ జంగాల కాలని సంచార జాతుల కుటుంబాల్లో కుమారీ పూజలు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, ప్రభాకర్, సంతోష్, మహిళా విభాగం కన్వీనర్ వినోద, కో కన్వీనర్ రమ, రాష్ట్ర బాధ్యులు రామారావు, రాష్ట్ర సహ కన్వీనర్ సంధ్య పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్యను అందించాలి'

గణేశ్‌నగర్, అక్టోబరు 6: నాణ్యమైన విద్యను పొందాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా విద్యా విధానాన్ని మార్చాలని బీయస్ రావు ఫౌండేషన్ ప్రెసిడెంట్ డా. బి.యస్ రావు (రూమటాలజిస్ట్) అన్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థ -నిరుద్యోగ సమస్య అనే అంశంపై ఫిలిం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మనదేశంలో ప్రస్తుత విద్యా విధానం కేవలం పాస్ పర్సెంటేజ్ మీదనే కేంద్రీకృతమై ఉందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించాలంటే తొలుత పాఠశాలల్లో, కాలేజీల్లో, యూనివర్సిటీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. లేబరేటరీ పరిశోధన అనుభవాలు, ప్రణాళికలు పర్చరచుకునే విధానాన్ని ప్రవేశపెట్టాలని అన్నారు. మనదేశంలో ఉన్న హయ్యర్ ఎడ్యుకేషన్ పొందుపరచిన ప్రమాణాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు. నాణ్యమైనవిద్య లభించకపోవటంతో దేశంలోని లక్షలాది మంది యువత విదేశాలకు వెళ్లి చదువుతున్నారు. దాంతో మన దేశ సంపద బయటి దేశాలకు వెళ్తోందన్నారు.

దేశంలో నిరుద్యోగమనేది ప్రధాన సమస్యగా మారిందన్నారు. మానవ వనరుల్ని సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధితో పాటు ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అతిథులుగా ప్రొఫెసర్ హరికాంత్, ఎస్‌యూ (ప్రిన్సిపల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్), టి. రఘువీర్, అడ్వకేట్ (ఉపాధ్యక్షులు కరీంనగర్ బార్ అసోసియేషన్)డా. ఎ.నరేష్ (ప్రెసిడెంట్ కరీంనగర్ ఐఎంఎ), జమాలొద్దీన్ (అడ్వకేట్)యస్. కొమురయ్య (ట్రాస్మ),ఎమ్. తిరుపతి రెడ్డి, (పిఆర్‌టియూ), పి.ఆర్ శ్రీనివాస్ , (ఎస్‌టియూ), యస్. జావిద్ (యుటిఎఫ్),యస్. ప్రభాకర్, (టిఆర్‌టిఎఫ్), డా. దాసరి శ్రీనివాస్ (న్యూరోఫిజీషియన్), నిషాని రాంచందర్ (అడ్వకేట్) తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బు గుర్తించడంలో ఈసీజీ కీలకం


ఈసీజీపై అవగాహన కల్పిస్తున్న మెడికవర్ డాక్టర్ అనీష్

సుభాష్‌నగర్, అక్టోబరు 6: ప్రాథమికంగా గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ కార్డియాలజిస్టు డాక్టర్ పబ్బ అనీష్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రతిమ హోటల్‌లో ఎంబీబీఎస్ వైద్యుల కోసం ఏర్పాటు చేసిన ఈసీజీ శిక్షణ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా గుండె పనితీరును ఈసీజీ ద్వారానే నిర్ధారిస్తున్నట్లు తెలిపారు. అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చినా ఈసీజీ ప్రాముఖ్యత తగ్గలేదన్నారు. పేషంట్ పరిస్థితిని తెలుసుకేందుకు అందుబాటులో ఉన్న ప్రతి వైద్యుడకి ఈసీజీ గురించి తెలుసుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్డియాలజీతోపాటు అన్ని విభాగాల వైద్యులకు ఈసీజీపై అందరికి అవగాహన కలిగిఉండాలని అందుకు మెడికవర్ తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, మార్కెటింగ్ సిబ్బంది హరీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6 : కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన గాయపరిచిన మద్ది సిద్ధు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. ఆర్టీసీకరీంనగర్ బస్టాండ్‌లో 2 డిపోకు చెందిన డ్రైవర్ ఎ సురేష్ తను నడుపుతున్న బస్సును పార్కింగ్ స్థలంలో పార్క్ చేస్తుండగా మద్ది సిద్ధు అనే వ్యక్తి బస్సుటాప్‌పైకి ఎక్కగా డ్రైవర్ అతన్ని కిందకు దింపగా ఆగ్రహంతో తన వద్ద ఫోల్డెడ్ కత్తితో డ్రైవర్ సురేష్‌పై దాడి చేసి గాయపరిచాడని సీఐ తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ కంట్రోల్ శ్రీనివాసరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


సన్మాన పత్రాలతో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు

గణేశ్‌నగర్, అక్టోబరు6: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు చేయాలని తెలం గాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కన్నం కుమార్ స్వామి కోరారు. కరీంనగర్, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులకు సన్మానం కార్యక్రమం జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయ ఆఫీసులో కన్నం కుమార్ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ ఆహార భద్రత కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జి పురమళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ 2001 నుండి 2014 వరకు జరిగిన తెలంగాణ పోరాటంలో ఎందరో ఉద్యమకారులు తమ యొక్క వ్యక్తిగత ప్రయోజనాలను పక్కకు పెట్టి తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలని ఏకైక లక్ష్యంగా ముందుకు సాగారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకురాలు ఐల ప్రసన్న, మండలాల అధ్యక్షులు భూమా సదానందం, ముంజంపల్లి సంజీవ్, గడ్డం సంపత్, జంగంపల్లి కుమార్, దేవునూరి అంకుష్, భూమా సదానందం, కనకం సాగర్, తాటిపల్లి శంకర్, మామిడి మొగిలి, బొజ్జ ఎల్లయ్య, రమేష్ కూనమల్ల మల్లేశం, పల్లి వెంకటేశం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


హుజూరాబాద్‌లోని నవభారతి విద్యాలయం విద్యార్థులు


జమ్మికుంట చాణక్య డిగ్రీ కళాశాల విద్యార్థులు


కుమార్‌వాడి యూపీఎస్ విద్యార్థులు


అలుగునూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు

హుజూరాబాద్/జమ్మికుంట/తిమ్మాపూర్/భగత్‌నగర్, అక్టోబరు 6: జిల్లాలోని పలు మండలాల్లో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. హుజూరాబాద్‌లోని నవభారతి విద్యాలయం, ఉషోదయ పాఠశాల విద్యార్థులు, జమ్మికుంట చాణక్య డిగ్రీ కళాశాల, తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల, కరీంనగర్‌లోని కుమార్‌వాడి యూపీఎస్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. అనంతరం తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటా


పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న సుంకె రవిశంకర్

గంగాధర, అక్టోబరు 6: అనాథ పిల్లలకు అండగా నిలుస్తానని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. నియోజకవర్గంలోని అనాథ పిల్లలకు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతి దసరా పండగకు పిలిచి భోజనంతో పాటు బట్టలను అందించేవారు. ఈ సందర్భంగా ఆదివారం పిల్లలకు బూరుగుపల్లి తన నివాసంలో ఎమ్మెల్యే దంపతులు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం పిల్లలకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే నాయకులకు సన్మానం

చిగురుమామిడి, అక్టోబరు 6: మండల కేంద్రంలో పలువురు టీయూడబ్ల్యూయూజే నాయకులకు జర్నలిస్టులు ఆదివారం సన్మానం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపికైన నన్నే అజయ్‌కుమార్, రాష్ట్ర హౌసింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికైన చిగురుమామిడి రిపోర్టర్ మార్త ప్రకాశ్‌ను, హుస్నాబాద్ కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుడు సదానందం ఏజీపీగా ఎంపికైన సందర్భంగా సన్మానించారు. అలాగే కోహెడ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఓ పత్రికా విలేఖరి శ్రీనివాస్‌రెడ్డి కొన్నిరోజుల క్రితం గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చేరాడు. దీంతో వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. హుస్నాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పిట్టల తిరుపతి, కార్యదర్శి చల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్(ఫైల్)

జమ్మికుంట రూరల్, అక్టోబరు 6: ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంటలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేశామ న్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా ఇరుకు రోడ్లలో వాహనాలు పార్కింగ్ చేయకుండా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్న ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు, కార్ల యాజమానులు, ఇతర వాహనదారుల వద్దకు స్వయంగా వెళ్లి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ లోడుతో వచ్చే వాహనాలు నేరుగా పట్టణంలోకి ప్రవేశించకుండా మోత్కులగూడెం చౌరస్తా నుంచి బైపాస్ రోడ్డు మార్గం గుండా వెళ్లే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వీణవంక రోడ్డులో ఇకపై వారసంత నిర్వాహణ జరుపకుండా చూస్తామన్నారు. పాత కూరగాయల మార్కెట్ రోడ్డు గుండా ఇకపై లారీలు, వ్యాన్లు, భారీ లోడు వాహనాలు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనదారులతో పాటు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తా


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

జమ్మికుంట, అక్టోబరు 6: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ ఆశావహ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు సొంత ఖర్చులతో వృత్తి నైపుణ్య కేంద్రం, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఉచిత శిక్షణ, లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, అక్టోబరు 6: నగరంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, రూరల్ ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమార్, కొలుపుల రాజులు తెలిపారు. బ్యాంక్ కాలనీ, అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంతం, రెడ్డి ఫంక్షన్ హాల్ ప్రాంతం, సుభాష్‌నగర్, రామ్‌చంద్రపూర్‌కాలనీ, గోదామ్‌గడ్డ, శ్రీనగర్‌కాలనీ, భగత్‌నగర్, సప్తగిరి కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ రూరల్ ప్రాంతంలో నగునూరు, ఆర్నకొండ, రుక్మాపూర్ కాట్నపల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి'

సుభాష్‌నగర్, అక్టోబరు 6: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అయిలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన కురుమ గొర్రెల కాపరి 11 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడడం సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎలకపెల్లి లచ్చయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు యెగుర్ల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల నర్సయ్య, పోలె గట్టయ్య, చిగుర్ల శ్రీనివాస్, కోరె గట్టయ్య, పోలె శ్రీనివాస్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కర్రె పావని, మీస బీరయ్య, శెవ్వాళ్ల అక్షయ్, దయ్యాల బీరయ్య, కర్రె రవి, గుంట అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 6: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో అన్నం పరబ్రహ్మ స్వరూపం దానిని వృథా చేయడం మహాపాపం అనే నినాదంతో హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ పోస్టర్‌ను ఆదివారంలో ఆలయ పూజారి పవన్ శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సాగర్‌తో పాటు ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్ సభ్యుడు వంగల పవన్, కన్నా కృష్ణ, వేణుగోపాల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 6: కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా సయ్యద్ మహబూబ్‌ను నియమిస్తూ ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో సయ్యద్ మహబూబ్‌కు నియామకపత్రాలను తాజొద్దీన్ అందజేశారు. కాంగ్రెస్‌పార్టీ పటిష్టతకు పాటుపడతానని సయ్యద్ మహబూబ్ ఈ సందర్భంగా పేర్కొన్నాడు.

పాఠశాల గది నిర్మాణానికి విరాళం

భగత్‌నగర్, అక్టోబరు 6: శ్రీసరస్వతి విద్యాపీఠం నిర్వహిస్తున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణానికి కొమ్మెర చంద్రశేఖర్‌రెడ్డి, కొమ్మెర ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎనిమిది లక్షల రూపాయల విరాళం అందించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ కరీంనగర్ పాఠశాలను ఇంటర్నేషనల్ స్కూల్‌గా మార్పు చేయుటకు విద్యాపీఠం సంకల్పించిందన్నారు. అందులో భాగంగా ఒక గది నిర్మాణం చేపట్టేందుకు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు కరుణాకర్‌రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సమితి ఆకర్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, సహ కార్యదర్శి కొండ గంగాధర్, రాపర్తి శ్రీనివాస్, కొలుగూరి సదాశివరెడ్డి, దేవరకొండ లక్ష్మణమూర్తి, రంగు దేవేందర్‌రెడ్డి, తాటి రాజేశ్వర్‌రావు, శ్రీరామోజు రవి, చెన్నమనేని రాజేశ్వరరావు, గుగ్గిలపు రమేష్, గుజ్జ శ్రీనివాస్, ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


మానకొండూర్, అక్టోబరు 6: కరీంనగర్‌లోని జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో నేత్ర, దంత, జనరల్ వ్యాధులకు సంబంధించిన 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిటిజన్ ఆసుపత్రి వైద్యులు రవీందర్‌రెడ్డి, తౌసీఫ్, అంజత్‌ఖాన్, ముస్తాక్‌అలీతో పాటు మానకొండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, జమాతె ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షులు సోహెబ్, సిబ్బంది ఉన్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లిలో హైద్రాబాద్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

కుక్కల బెడదను నివారించాలి

గన్నేరువరం, అక్టోబరు 6: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని వాటిని వెంటనే నివారించాలని రైతు హక్కుల సాధన సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లెల జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుక్కకాటుకు చాలామంది విద్యార్థులు, రైతులు గురవుతున్నారన్నారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి కుక్కల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పల్లెప్రకృతి వనం


పల్లెప్రకృతి వనం, ఇన్‌సెట్‌లో ఖాళీ మద్యం సీసాలు

తిమ్మాపూర్, అక్టోబరు 6: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం బ్లాక్ ప్లాంటెషన్ పరిసరాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రల్లె ప్రకృతి వనంలోకి వెళ్లగానే ఖాళీ మందు బాటిళ్లు, తాగి పగల గొట్టిన మందు బాటిళ్ల దర్శనం ఇస్తున్నాయి. సంబంధిత అధికారులు మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

హుజూరాబాద్, అక్టోబరు 6: పట్టణంలోని డివైడర్‌లో ఏర్పాటు చేసిన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోనో కార్పస్ చెట్ల వల్ల శ్వాసకోశ వ్యాధులతో పాటు చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని తొలగించాలని ఆదేశించినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. బాబు, మహేందర్, ఓదెలు, రామచంద్రం, శేఖర్, రవీందర్, భువనచంద్ర, సతీష్, సమ్మయ్య, స్వామి, నిరంజన్ పాల్గొన్నారు.